క్లుప్తంగా

పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు



చిట్టిగిద్దలో వెలుగుతున్న స్ట్రీట్ లైట్

నవాబుపేట: మండల పరిధి పలు గ్రామాల్లో వీధి దీపాలు పగలే వెలుగుతున్నాయి. లింగంపల్లి, ఎల్లకొండ, నారెగూడ, చిట్టిగిద్ద, పులుమామిడిలో కొత్తగా వీధి దీపాలు ఏర్పాటు చేశారు. కానీ వాటికి ఆన్‌ఆఫ్ ఏర్పాటు చేయించలేదు. దీంతో అవి నిత్యం వెలుగుతూ దర్శనమిస్తున్నాయి. స్థానిక పాలకులు, పంచాయతీ, విద్యుత్ అధికారులు, స్పందించి విధీ దీపాల స్తంభాలకు ఆన్‌ఆఫ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్

కొడంగల్: కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పట్నం నరేందర్ చెప్పారు. గాంధీనగర్ కాలనీలో ఎమ్మెల్యే మంగళవారం ఉదయం పర్యటించారు. స్థానికంగా జరుగుతున్న సీసీరోడ్ల పనుల గురించి గుత్తేదారుతో మాట్లాడారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

దౌల్తాబాద్: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఏఎస్‌ఐ ముత్తురాజు హెచ్చరించారు. మంగళవారం దౌల్తాబాద్ మండలం పోచమ్మతండా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మాట్లాడుతూ వాహనదారులు సంబంధిత పత్రాలను తమ దగ్గర ఉంచుకోవాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని చెప్పారు. గతంలో విధించిన చలాన్లను వసూలు చేశారు. పోలీసు సిబ్బంది శ్రీశైలం, నరేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మించిన భాగ్యం లేదు

మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి



కుమ్మరులకు మిషన్లు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

కొడంగల్: ఆరోగ్యానికి మించిన భాగ్యం లేదని కొడంగల్ లయన్స్ క్లబ్ ఫౌండర్, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నటరాజ్ అన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ 35వ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం నిర్వహించగా.. ముఖ్య అతిథులుగా గురునాథ్ రెడ్డి, నటరాజ్‌లు హాజరై మాట్లాడారు. పేదలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామని, ప్రతి ఒక్కరూ సేవా భావంతో మెలగాలని సూచించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని, అంధత్వ నివారణ, దంత వైద్యశిబిరం, రక్తదాన శిబిరం, కుమ్మరులకు మిషన్లు అందజేయడం లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఇండక్షన్ ఆఫీసర్ మృత్యుంజయ, రీజియన్ చైర్మన్ శ్రీనివాసులు, లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు దేశ్‌ముఖ్, యాదవ్, రాంరెడ్డి, భాస్కర్, శివకుమార్ గుప్తా, శ్రీకిషన్ రావు, మురహరి వశిష్ట, జయతీర్థాచారీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ పట్టణ నూతన కమిటీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, కార్యదర్శిగా దాసప్ప యాదవ్, కోశాధికారిగా ముద్దప్ప దేశ్‌ముఖ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోగా.. 2023–24 సంవత్సరానికి ప్రమాణ స్వీకారం చేశారు.

17న చౌడేశ్వరీ జయంతి

కొడంగల్ రూరల్: పట్టణ శివారులో వెలసిన శ్రీ నందవరం చౌడేశ్వరీ అమ్మవారి జయంతి ఉత్సవాలను ఈ నెల 17న సోమవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సంకారపు పవన్‌కుమార్, సంకారపు శివకుమార్ తెలిపారు. ఉదయం 7గంటల నుంచి అమ్మవారికి అభిషేకం, అలంకరణ, మంగళహారతులు ఉంటాయని, వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.



కుల్కచర్ల: కస్తూర్బా విద్యార్థినులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి మాధురి, సిబ్బంది



పెద్దేముల్: ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ బుచ్చిబాబు, వైద్య సిబ్బంది తదితరులు

ఒక్కరు ముద్దు.. ఇద్దరు వద్దు

'ఒక్కరు ముద్దు.. ఇద్దరు వద్దు. జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ప్రస్తుత పరిస్థితుల పట్ల అవగాహన పెంపొందించుకోవాలి. జనాభా పెరుగుదల వలన కలిగే నష్టాలను గ్రహించి, తగిన జాగ్రత్త పాటించాలి' అని వైద్యులు, సిబ్బంది అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం బడిపిల్లలతో కలిసి వైద్య సిబ్బంది ర్యాలీ తీశారు. – సాక్షి, నెట్‌వర్క్

సోషల్ ఆడిట్‌కు సిద్ధం

దౌల్తాబాద్: ఉపాధిహామీ పథకంలో భాగంగా 2020 డిసెంబర్ నుంచి 2023 వరకు జరిగిన పనులకు గాను సోషల్ ఆడిట్‌కు మండల ఉపాధి సిబ్బంది సర్వం సిద్ధం చేస్తున్నారు. వారం రోజుల్లో ఆడిట్ అధికారులు రానున్నారని, ఉపాధి పనుల రికార్డులను ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు సిద్ధం చేస్తున్నట్లు ఉపాధి అధికారులు వెల్లడించారు.

ఆర్థిక సాయం

కుల్కచర్ల: రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చెంచు రాములు అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి స్థానిక నేతలతో బాధిత కుటుంబీకులకు తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు నర్సింహులు, యాదయ్య, కృష్ణయ్య, లక్ష్మయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

తితిదే తరహాలో పూజలు



శ్రీవారి మూలమూర్తి

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో నేటి నుంచి పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బుధవారం రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు ఆచార్య వరణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ, వేదారంభం ప్రత్యేక పూజలతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. 13న గురువారం ఉదయం 9గంటలకు ఉత్సవ మూర్తులకు శతకళశ తిరుమంజనం, మధ్యాహ్నం 12గంటలకు అగ్ని ప్రతిష్ట, విశేష హోమాలు, పవిత్ర ప్రతిష్ట, రాత్రి 7గంటలకు కుంభావాహన, విశేష హోమాలు చేపట్టి.. 14న ఉదయం 9గంటలకు విశేష ఉక్త హోమాలు, పవిత్ర సమర్పణ, రాత్రి 8గంటలకు విశేష హోమాలు, 15న ఉదయం 9గంటలకు విశేష హోమాలతో పాటు పవిత్రోత్సవం, రాత్రి 7 గంటలకు మహా పూర్ణాహుతి, కుంభ బింబ ప్రదక్షిణం, ప్రోక్షణ కార్యక్రమాలు జరగనున్నాయి. రెండేళ్లకు ఒకసారి జరిగే వేడుకల్లో తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలోనే వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తారు.

ఈవీఎంలపై అవగాహన ఉండాలి

యంత్రాలపై సందేహాలు ఉంటే నివృత్తి చేస్తాం: తహసీల్దార్లు, డీటీలు



కొడంగల్: ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పిస్తున్న డీటీ సురేష్

పెద్దేముల్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ మహేశ్ అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండలం అడ్కిచెర్లలో ఈవీఎంల ప్రదర్శనతో పాటు మాక్ పోలింగ్ నిర్వహించారు. 18 ఏళ్లు నిండి ఓటు హక్కు కలిగిన వారికి యంత్రాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ మంగళవారం నుంచి ఓటరు అవేర్‌నెస్ ప్రోగ్రాం ప్రారంభించామని, ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా అప్పాయిపల్లిలో ఈవీఎం యంత్రంపై ఓటు ఎలా వేయాలనే విషయాన్ని ప్రజలకు వివరించారు. సాంకేతిక సమస్యలు రాకుండా మిషన్ పని చేసే విధానాన్ని ప్రజలకు చూపించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సురేష్ మాట్లాడారు. ప్రతి రోజు మండల పరిధి గ్రామాల్లో ఈవీఎం యంత్రాలపై ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రాఘవేందర్, వీఆర్‌ఏ గోపాల్, పోలీసు శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధారూరులో..

ధారూరు: వీవీ ప్యాడ్స్, ఈవీఎంల పనితీరుపై తహసీల్దార్ భువనేశ్వర్ ఓటర్లకు అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్‌తో కలిసి ధారూరు మండలం రుద్రారం, గట్టెపల్లిలో ఓటు వేసే విధానం, గుర్తులు గల వీవీ ప్యాడ్స్‌పై మీట ఎలా నొక్కాలో ప్రయోగాత్మకంగా చూపించారు. 192, 193 పోలింగ్ స్టేషన్లలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు పనిచేసే విధానం, ఈవీఎంల ద్వారా ఓటు వేసే పద్ధతి గురించి వివరించారు. ఈవీఎంలో వేసిన ఓటు వీవీప్యాడ్‌లో నమోదు అవుతున్న తీరును చూపించారు.

బంట్వారంలో..

బంట్వారం: ఈ నెల 18 వరకు గ్రామాల్లో ఈవీఎంలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని, ప్రజలకు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేస్తామని డీటీ భరత్‌గౌడ్ చెప్పారు. ఈవీఎంలపై కోట్‌పల్లి మండలం బార్వాద్, ఎన్కెపల్లిలో డీటీ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌లపై వివరించారు. కార్యక్రమంలో బార్వాద్ సర్పంచ్ వెంకటేశ్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, ఎన్కెపల్లి పంచాయతీ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

భారీ వాహనాలతో ప్రమాదం



తాండూరు-హైదరాబాద్ రోడ్డు మార్గంలోని ఓ పాఠశాల ఎదుట నుంచి వెళ్తున్న లారీ

ఉదయం, సాయంత్రం వేళలో నిలిపివేయండి: స్థానికుల వినతి

తాండూరు టౌన్: తాండూరు పట్టణం మీదుగా రాకపోకలు సాగిస్తున్న లారీలు, టిప్పర్‌లు, సిమెంటు ట్యాంకర్ల వంటి వాహనాల వలన ప్రమాదాలు పొంచి ఉన్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. భారీ వాహనాలు మితిమీరిన వేగంతో దూసుకెళ్తున్నాయని, వాటికి వేగ నియంత్రణ లేకుండా పోయిందని వాపోతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాల, కళాశాలలకు వెళ్లి వచ్చే విద్యార్థులకు వీటి వలన ఇబ్బందికరంగా మారిందని, గతంలో పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. కావున ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు గంటల పాటు ఈ వాహనాలను పట్టణ శివారులోనే నిలిపివేసేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నీటి వృథా అరికట్టేందుకు చర్యలు



పైపులైన్ లీకేజి మరమ్మతులు చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్

పరిగి: నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం పరిగి పట్టణం 10వ వార్డు తుంకులగడ్డలో మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్ లీకేజి కాగా.. జేసీబీ సహాయంతో మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నానని చెప్పారు. మున్సిపాలిటీలో ఎలాంటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు దశరథ్, వాటర్ మెన్‌లు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పట్టని పర్యటన ఎందుకు?

ప్రతిపక్ష కౌనిలర్ల వార్డులను పట్టించుకోని ఎమ్మెల్యే: కాంగ్రెస్

వికారాబాద్ అర్బన్: వార్డుల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఇవ్వని ఎమ్మెల్యే ఆనంద్.. తమ వార్డుల్లో పర్యటించే హక్కు లేదని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ మురళి అన్నారు. మంగళవారం రాజీవ్ గృహకల్పలో ఎమ్మెల్యే మీతో నేను కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ కౌన్సిలర్ మురళి, కార్యకర్తలు ఎమ్మెల్యేను అడ్డుకుంటామని ప్రకటించారు. దీంతో మంగళవారం ఉదయం కౌన్సిలర్, కొందరు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడారు. ఎమ్మెల్యే పర్యటన సమయంలో కనీసం తమ వార్డు సమస్యలు చెప్పుకునే అవకాశం లేకుండా పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు. మూడేళ్ల కౌన్సిల్ పాలనలో.. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అనే ఉద్దేశంతో తన వార్డు అభివృద్ధికి ఎమ్మెల్యే నిధులు ఇవ్వలేదని ఆరోపించారు.

తల్లి, బిడ్డ ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం



న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

పెద్దేముల్: తల్లి, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తుందని పెద్దేమూల్ ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి బుచ్చిబాబు అన్నారు. మంగళవారం ఆరోగ్య కేంద్రంలో 40మంది గర్భిణులకు పోషకాల కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పోషకాలతో పాటు నగదును అందజేస్తుందని తెలిపారు. మొదటి విడతలో 120 మందికి కిట్లు పంపిణీ చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో పీహెచ్ఎస్ అరుణకుమారి, సూపర్‌వైజర్ పుష్పలత, సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు చేస్తే.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా



జీపీ ఆవరణలో మాట్లాడుతున్న ఉపసర్పంచ్ తదితరులు

దోమ: గ్రామంలో జరిగే అభివృద్ధి పనులకు ఆటంకాలు కలిగిస్తూ, చెక్కులపై సంతకాలు చేయకుండా ఇబ్బంది పెడుతున్నానని సర్పంచ్ సురేష్ తనపై ఆరోపణలు చేస్తున్నారని బొంపల్లి ఉప సర్పంచ్ రఫిక్ పాష అన్నారు. మంగళవారం బొంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎంపీటీసీ రాములు, గ్రామస్తులతో కలిసి ఆయన మాట్లాడారు. అభివృద్ధిని అడ్డుకోవడం లేదని, జరిగిన పనులకు ముందుండి సంతకాలు చేస్తున్నానని ఆయన చెప్పారు. సర్పంచ్ కావాలనే తనపై లేనిపోని నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. చేసిన పనులకు వెచ్చించిన నిధులకు కాకుండా.. అదనంగా ఖర్చు చేశానంటూ.. చెక్కులు తెచ్చి, వాటిపై సంతకాలు పెట్టాలని సర్పంచ్ తనపై ఒత్తిడి తెస్తున్నారని ఉప సర్పంచ్ ఆరోపించారు. పూర్తి సమాచారంతో సర్పంచ్‌పై కలెక్టర్ ఫిర్యాదు చేస్తానని పాష పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాలల చైర్మన్లు అనంతయ్య, శ్రీనివాస్, బీఆర్ఎస్ నేతలు వెంకటయ్య, సంగయ్య, బాబర్, షఫీ, మల్లేశ్, రాజు, శేర్‌ఖాన్, గౌస్, అజీంఖాన్, ప్రశాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట: చిన్న కోల్కుందలో..



పెద్దేముల్: నాగులపల్లిలో పోచమ్మకు నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

చల్లంగా చూడు తల్లి

ఘనంగా ఊరూవాడా బోనాలు



కొడంగల్ రూరల్: బోనంతో భక్తురాలు

తాండూరు రూరల్: వర్షాలు సమృద్ధిగా కురిసి.. పాడిపంటలతో పల్లెలు పచ్చగా ఉండాలని భక్తులు అమ్మవారిని కోరుకున్నారు. తాండూరు మండలం ఐనెల్లి గ్రామస్తులు మంగళవారం పోచమ్మకు బోనమెత్తారు. ఈ సందర్భంగా నెత్తిన బోనంతో డప్పుదరువులు, శివసత్తుల పూనకాలు, నృత్యాలతో ఊరేగింపుగా పోచమ్మ సన్నిధికి వెళ్లారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న జ్యోతి, నాయకులు రామకృష్ణరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: ఊరూవాడను చల్లంగా చూడు తల్లి అంటూ భక్తులు బోనమెత్తారు. పెద్దేముల్ మండలం నాగులపల్లి, పెద్దేముల్ గ్రామాల్లో గ్రామ దేవతలు పోచమ్మ, మైసమ్మలకు ఆషాఢ మాసం బోనమెత్తారు. భక్తులు ఉదయం ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు దేవాలయాలకు బోనాలతో మహిళలు ఊరేగింపుగా వెళ్లారు. నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కళాకారులు నృత్యాలు, శివసత్తుల పూనకాలు పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

పోచమ్మతల్లికి..

కొడంగల్ రూరల్: హస్నాబాద్‌లో పోచమ్మ తల్లికి భక్తులు బోనమెత్తారు. నెత్తిన బోనంతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి.. పంటలు బాగా పండేలా చూడు తల్లి అంటూ వేడుకున్నారు.

చిన్న కోల్కుందలో..

మోమిన్‌పేట: చిన్న కోల్కుందలో బోనాల పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు నెత్తిన బోనంతో.. డప్పు చప్పుళ్ల నడుమ, పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి చేరుకొని బోనం సమర్పించారు. సర్పంచ్ సురేష్, గ్రామ పెద్దలు సంగన్న, అశోక్, ప్రవీణ, యాదయ్య పాల్గొన్నారు.



తాండూరు రూరల్: బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు



కొడంగల్ రూరల్: అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

ప్రతి వార్డుకు రూ.10 లక్షలు

మునిసిపల్ అత్యవసర సమావేశంలో తీర్మానం



సమీవేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ పీకే రెడ్డి

కొడంగల్: మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలని, అందుకు గాను ఒక్కో వార్డుకు రూ.10లక్షల నిధులు కేటాయించాలని మున్సిపాలిటీ అత్యవసర సమావేశంలో సభ్యులు తీర్మానించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు మాట్లాడారు. కేటాయించిన నిధులతో మురుగు కాల్వల నిర్మాణం చేపట్టాలన్నారు. పట్టణంలోని వ్యాపార వాణిజ్య సముదాయాల్లో స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా ప్లాస్టిక్‌ను నిషేధించాలని పేర్కొన్నారు. హరితహారంలో భాగంగా అన్ని వార్డుల్లో మొక్కలు నాటాలని, పారిశుధ్య పనుల్లో భాగంగా టిమోఫాస్ ఆయిల్, హైపో క్లోరైడ్ ఆయిల్, ఆయిల్ బాల్స్ కొనుగోలు చేయాలని నిర్ణయించారు. వీటికి అయ్యే ఖర్చును మున్సిపల్ సాధారణ బడ్జెట్, పట్టణ ప్రగతి నిధులు, ఆర్థిక సంఘం నిధుల నుంచి వాడుకోవాలని సభ్యులు తీర్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



పూడూరు: అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

పూడూరు: పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, పనికి తగిన వేతనం చెల్లించాలని పూడూరు మండల పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారానికి ఆరో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు సమస్యలు పరిష్కారించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్మికులు ముజాహిద్, బందయ్య, వెంకటయ్య, నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని కాంగ్రెస్ మండల నాయకుడు హన్మంతు డిమాండ్ చేశారు. అనంతరం కార్మికులకు హన్మంత్ అన్నదానం చేశారు.